**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది: 19.04.2026** **సమయం:18.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. ఏప్రిల్ 17 భారతీయ మహిళల పాలిట చీకటి రోజని కేంద్ర కార్మిక శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే అన్నారు. ఇండీ కూటమి మహిళలను, దక్షిణాదిని మోసం చేస్తోందని విమర్శించారు.
2. మహిళా బిల్లు ముసుగులో డీ లిమిటేషన్ తో దక్షిణాది ప్రాంతాలకు అన్యాయం చేసే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను ఇండీ కూటమి తిప్పికొట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.
3. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరిస్తోందని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.
4. రాష్ట్రంలో వచ్చే నాలుగు రోజులు పాటు అక్కడక్కడా తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

.........................................................................

**చీకటి రోజు:**

ఏప్రిల్ 17 భారతీయ మహిళల పాలిట చీకటి రోజని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే అన్నారు. హైదరాబాద్ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ఇండీ కూటమి మహిళలను, ముఖ్యంగా దక్షిణాదిని దారుణంగా మోసం చేస్తోందనీ..., మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తూ...

కుటుంబ రాజకీయాలకు పెద్దపీట వేస్తోందని ఆరోపించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాదికి అన్యాయం జరుగుతుందన్న ప్రతిపక్షాల ప్రచారం అబద్ధమని చెప్పారు. 50 శాతం పెంపు ద్వారా తెలంగాణలో 26, ఆంధ్రప్రదేశ్ లో 38 సీట్లు అదనంగా వస్తాయని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని మంత్రి విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రామ్ చందర్ రావు, ఎంపీ డీకే అరుణ, పలువురు బీజేపీ మహిళా నాయకులు పాల్గొన్నారు.

:: ::: :::: ::::: :::::: **బైట్// శోభా కరంద్లాజే** :::::: ::::: :::: ::: ::

-హైదరాబాద్

**సమ్మక్క సారలమ్మ:**

మహిళా బిల్లు ముసుగులో డీ లిమిటేషన్ తో దక్షిణాది ప్రాంతాలకు అన్యాయం చేసే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలను ఇండీ కూటమి తిప్పికొట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బిల్లు వీగిపోయేలా చేసినందుకు విపక్షాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ములుగు జిల్లా మేడారం సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను మంత్రి ధనసరి అనసూయ సీతక్క, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు లతో కలిసి  నివాస్ రెడ్డి, దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గద్దెల ప్రాంగణంలో జరుగుతున్న పనుల వివరాలను గుత్తేదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో కలిసి జాతర అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... మేడారం లో జరుగుతున్న అభివృద్ధి పనులు మరో ఐదు శాతం మిగిలి ఉన్నాయని, త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. గద్దెల ప్రాంగణంలో ప్రమాదంలో గాయపడిన బాలుడికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ... మోదీ ప్రభుత్వం కపట నాటకానికి తెరలేపిందనీ, బీజేపీ కి చిత్తశుద్ధి ఉంటే మహిళా బిల్లు మాత్రమే ప్రవేశపెట్టాలని సూచించారు. 2011 జనాభా లెక్కలు కాకుండా ఇప్పుడు జనాభా లెక్కలు పూర్తి చేసి డిలీమిటేషన్ బిల్లు ప్రవేశపెడితే

బాగుంటుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా మహిళలకు పెద్దపీట వేసిందనీ, బీజేపీ పార్టీ అధ్యక్ష స్థానంలో కూడా మహిళకు అవకాశమివ్వలేదని గుర్తు చేశారు.

-ములుగు

**మంత్రి వివేక్-సిద్దిపేట:**

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరిస్తోందని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. ఇతర పార్టీల నుండి పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ లో చేరిన సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈరోజు ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సిద్దిపేటలో సమస్యలు పరిష్కరించి, స్పెషల్ ఫండ్ ద్వారా అభివృద్ధి చేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే అర్హులందరికీ రేషన్ కార్డులు అందించి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే సిద్దిపేటలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో సిద్దిపేట మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తూ, పార్టీ కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

- సిద్దిపేట

**VHP గోరక్ష:**

ప్రకృతిని కాపాడుకునే ఏకైక మార్గం ఆవు అనీ, గోవులను రక్షించడానికి ప్రతి ఒక్కరూ ప్రతిన బూనాలని విశ్వహిందూ పరిషత్ జాతీయ సంయుక్త కార్యదర్శి, గోరక్ష కేంద్ర సహ ప్రముఖ్ ఆకారపు కేశవ రాజు పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని లోయర్ ట్యాంక్ బండ్ గో శాలలో గో వంశ రక్షణ సంవర్ధన సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... దేశంలో గోవులపై జరుగుతున్న కుట్రలను తిప్పి కొట్టాలని, కేంద్ర ప్రభుత్వం గోవుల కోసం అమలు చేస్తున్న పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేశవరాజు కోరారు.

::::: :::: ::: :: **సౌండ్ బైట్: ఆకారపు కేశవ రాజు, vhp జాతీయ నేత** :: ::: :::: :::::

-GS/RNU/HYD.

**టీపీసీసీ-మార్పులు:**

ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సూచనల మేరకు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (TPCC) ప్రోటోకాల్ & కోఆర్డినేషన్ కమిటీని పునర్వ్యవస్థీకరించినట్లు TPCC అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. చైర్మన్‌గా H. వేణుగోపాల్ రావు, వైస్ చైర్మన్‌గా కిశోర్ రెడ్డి, కన్వీనర్‌గా M.A. ఫహీమ్ నియమితులయ్యారు. వీరితో పాటు.... ఎన్. భాను ప్రకాష్ రెడ్డి, కేవీ ప్రసాద్, సూరజ్ తివారి, సుదిని మహేందర్, అల్లం రాకేష్ సభ్యులుగా నియమితులయ్యారు.

-GS/RNU/HYD

**విప్-ఆది శ్రీనివాసులు:**

రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోరి పలు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శ్రీనివాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.... గ్రేడ్ ఏ రకానికి 2,389 రూపాయలు, సాధారణ రకానికి 2,369 ధరతో కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు పెద్ద పీట వేస్తూ, నాణ్యమైన విద్యుత్,ఎరువులు అందేలా ఏర్పట్లు చేస్తున్నారని తెలిపారు. రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేసినట్లు, పంటలు ఎండిపోకుండా మూడుసార్లు ఎల్లంపల్లి నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

-సిరిసిల్ల

**ఫైర్ సర్వీస్ వారం:**

జాతీయ ఫైర్ సర్వీస్ వారం–2026 సందర్భంగా తెలంగాణ అగ్నిమాపక విభాగం ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు (RWAs) కోసం ఫైర్ సేఫ్టీ అవేర్ నెస్ & ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా...IPS, డైరెక్టర్ జనరల్ ఆఫ్ తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్- విక్రమ్ సింగ్ మాన్ మాట్లుడతూ.... అగ్ని ప్రమాదాలకు దారితీసే ప్రాథమిక కారణాలు, ప్రతిపాదిత ఫైర్ సవరణ చట్టంపై అభిప్రాయాలు, ఫైర్ ఫైటింగ్ వ్యవస్థలు, ఎలక్ట్రిక్

వాహనాల పార్కింగ్, ఛార్జింగ్‌కు సమస్యలు, మాక్ డ్రిల్స్ నిర్వహణ, వాలంటీర్ల శిక్షణ, ఫైర్ ఆడిట్ తదితర అంశాల గురించి వివరించారు. సుమారు 400 మంది సభ్యులు పాల్గొన్న కార్యక్రమంలో అగ్నిమాపక వాహనాలు, పరికరాలను ప్రదర్శించారు.

-GS/RNU/HYD.

**వాతావరణం:**

రాష్ట్రంలో వచ్చే నాలుగు రోజులు పాటు అక్కడక్కడా  తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మెరుపులతో కూడిన ఈదురు గాలులు గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని పేర్కొంది. ఉత్తర, పశ్చిమ మధ్య తెలంగాణ ప్రాంతాలలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఎండగా ఉంటూనే... ఆ తర్వాత తేలికపాటి వర్షాలు, పలు చోట్ల వడగళ్ల వానలు రాత్రి వరకు కురిసే అవకాశముంది. తూర్పు తెలంగాణ జిల్లాలలో మాత్రం పూర్తిగా ఎండ వాతావరణం నెలకొంటుంది. హైదరాబాద్‌లో ఈ సాయంత్రం అక్కడక్కడా తేలికపాటి వర్షం కురుస్తుందని వాతావరణ కేంద్రం అంచనా వేస్తోంది.

-ఎడిటర్/డెస్క్

**BRS సమ్మేళనం:**

BRS పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేస్తూ, పార్టీ శ్రేణుల్లో భరోసా కల్పించే లక్ష్యంతో ఖమ్మంలో ఈ సాయంత్రం నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ నేతృత్వంలో నగరంలోని మమత ఆసుపత్రి ఆవరణలో జరిగే ఈ సమ్మేళనానికి మాజీ మంత్రి టి. హరీష్ రావు హాజరవుతారని సమాచారం. పార్టీకి చెందిన ఎంపీలు, మాజీ శాసనసభ్యులు, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నేతలు హాజరు కానున్నారు.

-ఖమ్మం

**కడియం శ్రీహరి:**

రెండేళ్లలో నియోజకవర్గానికి 1400 కోట్ల అభివృద్ధి నిధులు తీసుకువచ్చినట్లు మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ శాసనసభ్యులు కడియం  హరి అన్నారు. జిల్లాలోని చిల్పూర్

మండలం మల్కాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనులను ఈరోజు మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం రాజకీయ కుట్రతోనే మహిళా బిల్లుకు, డిలిమిటేషన్ బిల్లుకు ముడి పెట్టిందని ఆరోపించారు. నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి రెండు పంటలకు సాగు నీరు అందించడమే తమ సంకల్పం అని స్పష్టం చేశారు.  ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఏడవెల్లి లావణ్య మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జాలూకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ పొట్లపల్లి  ధర్ రావు  తదితరులు పాల్గొన్నారు.

-జనగామ

**అడ్లూరి లక్ష్మణ్:**

పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలకు పాల్పడిందని, ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. జగిత్యాలలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆరెస్ చేసిన ఆరోపణలను ఖండించారు. కొండగట్టు ఘాట్ రోడ్ ప్రమాద సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కే చంద్ర శేఖరరావు బాధితులను పరామర్శించలేదని విమర్శించారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ బిల్లుపై గొంతెత్తిన నాయకుడు రేవంత్ రెడ్డి అనీ... ప్రజా సమస్యల పరిష్కారంలో ముఖ్యమంత్రి సింహంలా ముందుకు సాగుతున్నారని అన్నారు. ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధిపై తారకరామారావు చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, ధర్మపురికి వస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామన్నారు. నేరేళ్ల దళితులపై జరిగిన దాడి ఘటనపై త్వరలోనే సిరిసిల్లకు వచ్చి ప్రశ్నిస్తానని, సమాధానం చెప్పేందుకు బీఆరెస్ నేతలు సిద్ధంగా ఉండాలన్నారు.

-జగిత్యాల

**బీఆర్ఎస్ ధర్నా:**

హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై మట్టి కట్ట నిర్మాణానికి వ్యతిరేకంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్లో బీఆర్ఎస్ నాయకులు ఈ రోజు నిరసన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని

డిమాండ్ చేశారు. ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ఎదుట ఉన్న మట్టి కట్టను తొలగించి, అండర్ పాస్ ఏర్పాటు చేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో జాతీయ రహదారిపై కొంతసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- యాదాద్రి భువనగిరి

**ఫార్మర్ రిజిస్ట్రీ:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. వ్యవసాయ శాఖ ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు, మీ సేవ కేంద్రాల మేనేజర్లతో ఈరోజు  ఆన్ లైన్ వేదికగా ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను అనుసంధానం ప్రాధాన్యతను కలెక్టర్ వివరించారు. అధికారులు, మీసేవ కేంద్రాల ఆపరేటర్లు తమ పరిధిలోని రైతులకు అవగాహన కల్పించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

- భద్రాద్రి కొత్తగూడెం